ఈ రహదారులు జగనన్న పుణ్యమే...

- వాస్తవాలను విస్మరించి కూటమి నేతల అబద్ధాలు
- ఆ రోడ్లపైనే నేటి మంత్రుల కాన్వాయ్‌ల పరుగు





గంగన్నదొర వలస నుంచి తోణాం వరకు గత ప్రభుత్వంలో వేసిన బీటీ రోడ్డు. (ఇన్‌సెట్లో) గత ప్రభుత్వ హయాంలో వేసిన శంబర రోడ్డుపై వెళ్తున్న ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ కాన్వాయ్(ఫైల్)

సాలూరు రూరల్:

కూటమి నేతలు రోడ్ల పనులకు శంకుస్థాపనలు చేస్తూ గత ప్రభుత్వం ఏజెన్సీ రోడ్లను విస్మరించిందని అబద్ధపు ఆరోపణలు చేస్తున్న విషయమై గిరిజనులు విస్తుపోతున్నారు. ప్రస్తుత పాలకులు రోడ్లకు శంకుస్థాపనలు చేయడం మంచిదే అయినా.. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధిని కప్పిపుచ్చడం ఎంత వరకు సమంజసమని వారు ప్రశ్నిస్తున్నారు. ప్రస్తుతం కూటమి నాయకులు రయ్.. రయ్.. అంటూ తమ వాహనాలపై పరుగులు తీస్తున్న రోడ్లు గత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో వేసిన వేనన్న వాస్తవాలను విస్మరించకూడదని వారు సూచించారు. సాలూరు నియోజకవర్గంలో గత ప్రభుత్వ హయాంలో మాజీ ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర రూ.1200 కోట్ల నిధులు మంజూరు చేయించి అభివృద్ధి పనులను పరుగులు పెట్టించడంలో కీలక పాత్ర పోషించారని వారు చెబుతున్నారు. ఇటీవల కూటమి ప్రభుత్వం వచ్చాక వంద రోడ్లు పండగ అంటూ హడావుడి చేయడం సంతోషమే అయినా... గతాన్ని విస్మరించకూడదని చెబుతున్నారు. ఏజెన్సీలో గ్రామాలకు గత 20 ఏళ్లుగా రోడ్లు మంజూరు కాలేదు.. డోలీ మోతలు తప్పలేదని గౌరవ మంత్రి విమర్శించడం పట్ల గిరిజనులు అవాక్కవుతున్నారు. ప్రస్తుతం పనులు చేపడుతున్న రోడ్లు గత ప్రభుత్వ హయాంలోనే మంజూరైనట్లు అధికారుల రికార్డులే చెబుతున్నాయని వారు పేర్కొన్నారు. ఇటీవల మక్కువ మండలం బాగుజాల నుంచి శిరివర రోడ్డు శంకుస్థాపనకు వచ్చిన ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ శంబర రోడ్డులో ప్రయాణిస్తూ అక్కడ రోడ్డుతో పాటు ఆహ్లాదకర వాతావరణాన్ని చూసి రోడ్డు దిగి నడిచి వెళ్లారు. అయితే శంబర రోడ్డు గతంలో కనీసం బైక్‌లు కూడా వెళ్లలేని పరిస్థితి ఉండగా మామిడిపల్లి కూడలి నుంచి శంబర మీదుగా మక్కువ వరకు బీటీ రోడ్డు వేసింది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలోనే అన్న విషయాన్ని మరువకూడదని స్థానికులు చెబుతున్నారు. ఇటీవల గిరిజన శాఖ మంత్రి సంధ్యారాణి తోణాం గ్రామంలో గత ప్రభుత్వం అసలు రోడ్లు విస్మరించందన్న ఆరోపణలు చేయగా.. గంగన్నదొర వలస నుంచి తోణాం గ్రామం వరకు రూ.2.70 కోట్లతో మాజీ ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర వేసిన రోడ్లపైనే మంత్రి కాన్వాయి ప్రయాణించిన విషయాన్ని తోణాం గ్రామ సర్పంచ్ మువ్వల ఆదియ్య గుర్తు చేస్తున్నారు. మొత్తంగా చూస్తే ఏజెన్సీలో ఎక్కువ దూరం రోడ్లు వేయించింది జగనన్న ప్రభుత్వమేనని గిరిజనులు ఖరాకండిగా చెబుతున్నారు.

సాగునీటి ప్రాజెక్టులను అభివృద్ధి చేయాలి : సీపీఎం



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి గంగునాయుడు

పార్వతీపురం టౌన్: జైకా నిధులు రూ.137 కోట్లు విడుదల చేసి మన్యం జిల్లాలో ఉన్న సాగు నీటి ప్రాజెక్టులను అభివృద్ధి చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.తిరుపతిరావు, కె.రామస్వామి డిమాండ్ చేశారు. పట్టణంలో విలేకరులతో వారు శనివారం మాట్లాడారు. పార్వతీపురం మన్యం జిల్లాలో ఉన్న ప్రధానమైన సాగునీటి ప్రాజెక్టులు వెంగళరావు సాగర్, పెద్దగడ్డ, ఒట్టిగడ్డ, పెదంకలాం ప్రాజెక్టులకు జపాన్ ప్రభుత్వం నుంచి జైకా నిధులు రూ.137 కోట్లు గత ప్రభుత్వంలో మంజూరయ్యాయని తెలిపారు. జైకా నిధుల కోసం గత ఏడెనిమిది సంవత్సరాల నుంచి రాష్ట్ర ప్రభుత్వాలు సాగునీటి ప్రాజెక్టు అధికారులను జపాన్ పంపించి అనేకమైన శిక్షణలు ఇప్పించి, నిధులు తెప్పించారని, కానీ పూర్తి స్థాయిలో పనులు జరగలేదని ఆరోపించారు. తెలుగుదేశం, కూటమి ప్రభుత్వం స్థానిక మంత్రి సంధ్యారాణి చొరవ తీసుకొని వట్టిగడ్డ, పెద్ద గడ్డ, పెదంకలాం వెంగళరావు సాగర్ ప్రాజెక్టు పరిధిలో గల జైకా నిధులు తెప్పించి పూర్తిస్థాయిలో కాలువల లైనింగ్ పనులు చేయించి శివారు భూమి వరకు నీరు వెళ్లే విధంగా కాలువలు అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే పనులు చేసి బకాయిలు ఉన్న కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించాలని కోరారు.

సమ్మె ఒప్పంద జీఓలు విడుదల చేయాలి



మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న సీఐటీయూ నాయకులు

పార్వతీపురం టౌన్: ప్రభుత్వం ఏర్పడి ఏడు నెలలు గడుస్తున్న నేటికీ మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించకపోవడం అన్యాయమని సీఐటీయూ జిల్లా కోశాధికారి జి.వెంకటరమణ ప్రభుత్వాన్ని విమర్శించారు. గతంలో మున్సిపల్ కార్మికులు చేసిన సమ్మె కాలపు ఒప్పంద జీఓలను అమలు చేయాలని రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా శనివారం పార్వతీపురం స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం శానిటర్ ఇన్‌స్పెక్టర్ కె.వెంకట పకీర్‌రాజుకు వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో మున్సిపల్ కార్మికులు చేసిన పోరాటానికి నాటి ప్రతిపక్ష ప్రభుత్వమైన నేటి అధికార ప్రభుత్వ టీడీపీ నాయకులు కార్మికులకు మద్దతు తెలిపారని గుర్తు చేసారు. నేడు అధికారం చేపట్టిన అనంతరం పూర్తిగా దానిని విస్మరించారని తెలిపారు. కార్మికులకు అందించాల్సిన కనీస అవసరాలు కూడా కల్పించకుండా ప్రభుత్వం పెడచెవిన పెట్టడం బాధాకరమని మండిపడ్డారు. ఇకనైనా ప్రభుత్వం స్పందించి గత సమ్మె కాలపు ఒప్పందాల జీఓలను జారీ చేయాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్, ఎక్స్‌గ్రేషియో ఇవ్వాలని, రిటైర్‌మెంటు వయసు 62కు పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ నాయకులు సీహెచ్ సింహాచలం, నాగవంశం శంకర్రావు, సీఐటీయూ నాయకులు పి.రాజశేఖర్, కార్మికులు మామిడి శివ, బంగారు రవి, బంగారు రాజేష్, వర్కర్లు, మేస్త్రీలు, డ్రైవర్లు పాల్గొన్నారు.

గ్రామ రక్షకుడిగా పనిచేసిన యోధుడు వడ్డె ఓబన్న

పార్వతీపురం టౌన్: గ్రామ రక్షకుడిగా పని చేసిన యోధుడు వడ్డె ఓబన్న అని అదనపు ఎస్పీ దిలీప్ కిరణ్ అన్నారు. స్వాతంత్ర సమరయోధుడు వడ్డే ఓబన్న జయంతి సందర్భంగా జిల్లా పోలీసు కార్యాలయంలో శనివారం వడ్డే ఓబన్న చిత్రపటానికి జిల్లా అదనపు ఎస్పీ దిలీప్‌కిరణ్ పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వడ్డే ఓబన్న 1807 జనవరి 11న రేనాటి ప్రాంతంలో నొస్సం గ్రామంలో వడ్డెసుబ్బన్న, సుబ్బమ్మ దంపతులకు జన్మించారన్నారు. వడ్డె ఓబన్న గ్రామ రక్షకుడిగా పని చేశారని, రైతులపై అధిక పన్నులు విధించడం వలన బ్రిటీష్ పాలనకు వ్యతిరేకంగా ప్రజల కోసం చేసే పోరాటంలో కీలక పాత్ర పోషించారని తెలిపారు.

నొస్సం పాలెగాడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి చేసిన సాయుధ పోరులో, సైన్యాధ్యక్షుడిగా వడ్డే ఓబన్న పోషించిన తీరు వీరోచితమన్నారు. ప్రతీ ఒక్కరు తమ జీవితంతో స్వాతంత్ర సమరయోధులను ఆదర్శంగా తీసుకోవాలని, వారి జీవితం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ఏఆర్ ఆర్ఐ నాయుడు, రాంబాబు, ఆర్ఎస్ఐలు, ఎస్పీ ఎస్ఐలు, ఎస్‌బీ, డీసీఆర్‌బీ, టీఏ, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పాడిపశువుల సంరక్షణకు ప్రాధాన్యం



గోశాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విజయచంద్ర

సీతానగరం: ప్రభుత్వం పాడి పశువుల సంరక్షణకు, పాడి పరిశ్రమాభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇచ్చిందని ఎమ్మెల్యే బి.విజయచంద్ర అన్నారు. మండలంలోని మరిపివలసలో ఎన్‌ఆర్‌జీఎస్ నిధులతో పాడి రైతులు నిర్మించిన గోశాలను శనివారం ఆయన ప్రారంభించారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ పాడిపశువుల సంరక్షణకు గోశాలలు నిర్మాణం అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ నేపథ్యంలో మొదటి విడతగా మంజూరు చేసిన 24 గోశాలలకు గాను 23 మంది లబ్ధిదారులు నిర్మాణం చేసేందుకు ముందుకు రావడంతో నిర్మాణాలు వివిధ స్థాయిల్లో ఉన్నాయన్నారు. ఎంపీడీఓ త్రివిక్రమరావు, మండల పశువైద్యాధికారి డాక్టర్ రామారావు, సర్పంచ్ సాంబందొర, ఉపాధి హామీ పథకం ఏపీఓ భాను, ఈఓపీఆర్‌డీ కె.కుమారవర్మ, పంచాయతీ కార్యదర్శి మురళి పాల్గొన్నారు.

నెలాఖరు నాటికి భూ సమస్యల పరిష్కారం

- సర్వే అండ్ సెటిల్‌మెంట్ ఏడీ లక్ష్మణరావు



మాట్లాడుతున్న జిల్లా ల్యాండ్ సర్వే అండ్ సెటిల్‌మెంట్ ఏడీ

సీతానగరం: జిల్లాలో రెవెన్యూ, సర్వే అధికార సిబ్బంది వేర్వేరుగా నిర్వహించే గ్రామ సభల్లో వచ్చిన వినతులను జనవరి 31 నాటికి పరిష్కరించడానికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని సర్వే అండ్ సెటిల్‌మెంట్ ఏడీ పి.లక్ష్మణరావు అన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో మండల సర్వేయర్ కె.చంద్రశేఖరరావు అధ్యక్షతన గ్రామ సర్వేయర్లు, రెవెన్యూ సర్వేయర్లు నిర్వహించిన గ్రామసభల్లో వచ్చిన ఫిర్యాదులపై శనివారం సమీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లాలో సీసీఎల్ఏ ఆదేశాల మేరకు రైతులకు సంబంధించిన రెవెన్యూపరమైన సమస్యలను సత్వరమే పరిష్కరించడానికి మండలాల వారీగా సమీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు. జిల్లాలో గ్రామసభల ద్వారా రైతుల నుంచి 31,202 ఫిర్యాదులు వచ్చాయని, వాటన్నిటినీ రిజిస్ట్రేషన్ చేయాల్సి ఉందన్నారు. ఈ మేరకు వచ్చిన ఫిర్యాదులన్నీ ఆఫ్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసినప్పటికీ ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేయాల్సి ఉందన్నారు. మండల సర్వేయర్ కె.చంద్రశేఖరరావు మాట్లాడుతూ మండలంలోని 2,604 ఫిర్యాదులు వచ్చాయని తెలిపారు. అందులో 369 ఫిర్యాదులు ఆన్‌లైన్ ద్వారా రిజిస్ట్రేషన్ చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్వేయర్లు, వీఆర్‌ఓలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ప్లాస్టిక్ నిషేధాన్ని అతిక్రమిస్తే చర్యలు



మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరాజు

పార్వతీపురం టౌన్: ప్లాస్టిక్ నిషేధాన్ని అతిక్రమిస్తే చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరాజు అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ ప్లాస్టిక్ నిషేధాన్ని అతిక్రమిస్తే అపరాధ రుసుముతో పాటు చర్యలు ఉంటాయన్నారు. ప్లాస్టిక్ నిషేధంపై వ్యాపారస్తులు అవగాహన కలిగి ఉండాలన్నారు. క్లీన్ పార్వతీపురంగా తీర్చిదిద్దేందుకు ప్రతీ ఒక్కరు సహకరించాలన్నారు. ప్రభుత్వాదేశాల మేరకు సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులను నిషేధించడమైందన్నారు. వ్యాపారస్తులు వాటిని విక్రయిస్తే జరిమానా విధించడంతో పాటు సరుకు స్వాధీనం చేసుకుంటామన్నారు.

మినీ గోశాలలు ప్రారంభం



వెంకటభైరిపురంలో మినీ గోశాలను ప్రారంభించిన సర్పంచ్ వెంకటరత్నం

మక్కువ: మండలంలోని పలు పంచాయతీలలో ఎన్‌ఆర్‌జీఎస్ ఆధ్వర్యంలో నిర్మించిన మినీ గోశాలలను శనివారం ప్రజాప్రతినిధులు ప్రారంభించారు. మండలంలో పనసభద్ర, మార్కొండపుట్టి, కోన, బంగారువలస, తూరుమామిడి, వెంకటభైరిపురం, డి.శిర్లాం, సన్యాసిరాజపురం గ్రామాలలో మినీ గోశాలలు నిర్మాణాలు జరగగా ఆయా పంచాయతీల సర్పంచ్‌లు చేతులు మీదుగా ప్రారంభించారు. గోశాలలను రైతులు సక్రమంగా సద్వినియోగం చేసుకోవాలని ప్రజాప్రతినిధులు కోరారు. కార్యక్రమంలో ఎన్‌ఆర్‌జీఎస్ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

డీఎంహెచ్‌ఓను కలిసిన ఐఎంఏ సభ్యులు



డీఎంహెచ్‌ఓకు పుష్పగుచ్ఛాన్ని అందజేస్తున్న ఐఎంఏ సభ్యులు

పార్వతీపురం: నూతనంగా డీఎంహెచ్‌ఓగా బాధ్యతలను స్వీకరించిన డాక్టర్ ఎస్.భాస్కరరావును ఇండియన్ మెడికల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు, ప్రముఖ కంటివైద్య నిపుణులు డాక్టర్ యాళ్ల వివేక్, రిటైర్డ్ డాక్టర్ ప్రభాకరరావు, చిన్నపిల్లల వైద్య నిపుణులు డాక్టర్ బోగేశ్వరరావు ఆయన చాంబర్‌లో శనివారం కలసి పుష్పగుచ్ఛాన్ని అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ ఇండియన్ మెడికల్ అసోసియేషన్ మెరుగైన సేవలను అందించాలని కోరారు. పలువురు వైద్యులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించాలి



స్పెషల్ డ్రైవ్‌లో పాల్గొన్న రూరల్ ఎస్‌ఐ సంతోషి

పార్వతీపురం టౌన్: వాహన చోదకులు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని ఎస్‌ఐ సంతోషి సూచించారు. పట్టణ శివారులో శనివారం వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మైనర్లకు వాహనాలిస్తే చర్యలు తప్పవన్నారు. వాహన పత్రాలు ఉండాలని సూచించారు. రూరల్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

తప్పిన ప్రమాదం



విద్యుత్ వైర్లను తాకుతూ ముందుకు వెళ్తున్న లారీ

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): కురుపాం మెయిన్ రోడ్డులో శనివారం ప్రమాదం తప్పింది. పార్వతీపురం వైపు కర్రల లోడుతో వెళ్తున్న లారీ అక్కడి విద్యుత్ వైర్లకు తగిలింది. దీంతో ఒక్కసారిగా నిప్పురవ్వలు నేలరాలాయి తప్ప వైర్లు తెగిపడలేదు. దీంతో పెద్ద ప్రమాదమే తప్పిందని స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. విద్యుత్ శాఖ అధికారులు స్పందించి, ఇలాంటి భారీ లారీలకు వైర్లు తగలకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

● ఘనంగా కూడారై



సాలూరు పట్టణంలోని పెదకోమటిపేట రామాలయంలో ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా కూడారై వెల్లం సేవ శనివారం ఘనంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. స్థానికంగా ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. – సాలూరు

ఆర్టీసీలో అదనపు సర్వీసులు



డిపో మేనేజర్ కనకదుర్గ

పార్వతీపురం టౌన్: సంక్రాంతి పండగ సందర్భంగా ప్రయాణికులకు ఇబ్బందులు కలగకుండా పూర్తి చర్యలు చేపట్టామని పార్వతీపురం ఆర్టీసీ డిపో మేనేజర్ కనకదుర్గ తెలిపారు. శనివారం స్థానిక డిపోలో విలేకరులతో మాట్లాడుతూ ప్రస్తుతం విశాఖపట్నానికి 40 సింగిల్ సర్వీసులు నడుస్తున్నాయన్నారు. పండగకు ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉండడంతో 20 సింగిల్ సర్వీసులను డబుల్ సర్వీసులుగా మార్చడమే కాకుండా మరో 20 అదనపు సర్వీసులను ప్రారంభించామన్నారు. 24 గంటలు బస్సు సర్వీసులను ప్రతీ 15 నిమిషాలకు ఓ సర్వీసును ప్రారంభించి ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా పూర్తి ప్రణాళికలను సిద్ధం చేశామని తెలిపారు.

సంక్రాంతి సంబరాలు



సంక్రాంతి సంబరాల్లో పాల్గొన్న మంత్రి సంధ్యారాణి

సాలూరు : సంక్రాంతి సంబరాలు పల్లెలు, పట్టణాల్లో సందడిగా జరుగుతున్నాయి. ముందస్తుగా భోగి మంటలు వేస్తున్నారు. మరోవైపు ముగ్గుల పోటీలతో మహిళలు అలరిస్తున్నారు. హరిదాసులు తమ నామకీర్తనలతో సంప్రదాయాలను పాటిస్తూ మేల్కొలుపుతున్నారు. పిల్లలు, పెద్దలు అందరూ పాల్గొంటూ సందడి చేస్తున్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు

సాలూరు: సంక్రాంతి పండగ నేపథ్యంలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని రూరల్ ఎస్‌ఐ నర్సింహమూర్తి హెచ్చరించారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కోడి పందాలు, పేకాట, పొట్టేళ్ల పందాలు తదితర వాటికి దూరంగా ఉండాలన్నారు. అందరూ సంతోషంగా సంక్రాంతి జరుపుకోవాలని సూచించారు.

పండగ రోజుల్లో తస్మాత్..



మాట్లాడుతున్న పట్టణ సీఐ మురళీధర్, ఎస్‌ఐ గోవింద్

పార్వతీపురం టౌన్: సంక్రాంతి పండగ సందర్భంగా ప్రజలు జాగ్రత్తలు పాటించాలని పార్వతీపురం పట్టణ సీఐ మురళీధర్ తెలిపారు. సంక్రాంతి పండగ సందర్భంగా గ్రామాల్లో ఇళ్లను ఖాళీ చేసి వేరే గ్రామాలకు వెళ్లే కుటుంబాలు పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. శనివారం పట్టణ పోలీసు స్టేషన్‌లో విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్రాంతి పండగను పురస్కరించుకొని అపరిచితులు సంచరించే అవకాశం ఉన్నందున ముందు జాగ్రత్త చర్యగా పండగను పురస్కరించుకొని ఇళ్లకు తాళాలు వేసి బయటకు వెళ్లే వారంతా పోలీసులకు సమాచారం అందిస్తే తమ దృష్టి ఆ ఇళ్లపై ఉంటుందని తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవన్నారు. పార్వతీపురం ఆర్టీసీ కాంప్లెక్స్ కూడలి నుంచి పాతబస్టాండ్ వరకు రద్దీ దృష్ట్యా వాహనాలను అనుమతించడం లేదని వాహన చోదకులు గమనించి పోలీసు వారికి సహకరించాలని ఆయన కోరారు. వాహన చోదకులు రోడ్డు భద్రత పాటించాలని సూచించారు. ఎస్‌ఐ గోవింద్ పాల్గొన్నారు.

గర్భిణులకు మెరుగైన వైద్యం అందించాలి

గరుగుబిల్లి: గర్భిణులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని వైద్యారోగ్య శాఖ జిల్లా ప్రోగ్రాం అధికారి పి.జగన్మోహనరావు సూచించారు. మండలంలోని పెదగుడబ పంచాయతీ, ఎస్ఆర్‌పేటను శనివారం సందర్శించిన ఆయన.. ప్రజలకు, వైద్యారోగ్య సిబ్బందికి పలు సూచనలు చేశారు. గర్భిణులు, బాలింతలు, కిశోరి బాలికలు, మహిళలు రక్తహీనత బారినపడకుండా జాగ్రత్త వహించాలన్నారు. రక్తహీనతతో బాధపడుతున్న వారిని గుర్తించి, వారికి సకాలంలో సరైన వైద్యం అందించాలన్నారు. గర్భిణులంతా ఐరన్, కాల్షియం మాత్రలను విధిగా తీసుకునేలా చూడాలన్నారు. చిన్నారులకు సమయానికి వేయాల్సిన వ్యాక్సిన్లు వేయాలన్నారు. దీర్ఘకాలిక రోగుల ఆరోగ్యం మెరుగుకు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ జయగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

తగ్గిన సంక్రాంతి శోభ



రద్దీ లేని మార్కెట్

సాలూరు:

సంక్రాంతి పండగ శోభ తగ్గింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో అమలైన సంక్షేమ పథకాలు చాలా వరకు నిలిచిపోయాయి. ముఖ్యంగా రైతు భరోసా, అమ్మ ఒడి, వైఎస్సార్ భరోసా, వైఎస్సార్ చేయూత వంటి పథకాలతో అన్ని వర్గాల ప్రజలకు ఆర్థిక భరోసా లభించేది. ప్రజల ఖాతాల్లో ప్రతి నెలా ఏదో ఒక పథకం కింద డబ్బులు జమయ్యేవి. దీంతో సంక్రాంతితో పాటు ఏ పండగ వచ్చినా ఘనంగా జరిపేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. కూటమి ప్రభుత్వం వచ్చాక సంక్షేమ పథకాలకు చాలా వరకు ఆగిపోయాయి. ఒక్క పింఛన్ తప్ప తక్కినవన్నీ ఆగిపోయాయి. దీంతో ప్రజలు తమ కాయకష్టంపై ఆధారపడి పండగ చేసుకోవాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో ఇంటి ఖర్చులకే డబ్బులకు కష్టం కావడంతో పండగకు ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారు.

తగ్గిన వస్త్ర వ్యాపారం

సంక్రాంతి పండగకు ప్రతి ఒక్కరూ కొత్త వస్త్రాలు ధరిస్తారు. దీంతో వస్త్ర వ్యాపార దుకాణాలు కలకలలాడేవి. అయితే గతంతో పోల్చి చూస్తే 60 శాతం వరకు వస్త్ర వ్యాపారం తగ్గిందని వ్యాపారులు చెబుతున్నారు. దీనికి ప్రధాన కారణం ప్రభుత్వ సంక్షేమ పథకాలు నిలిచిపోవడమేనని పేర్కొంటున్నారు. దీనికి తోడు ఆన్‌లైన్ బిజినెస్‌ల వైపు కొందరు మొగ్గు చూపడం కూడా వ్యాపారాలు పడిపోవడానికి కారణమని చెబుతున్నారు.

స్నేహభావంతో కొనసాగాలి

భామిని: క్రీడాకారులు స్నేహభావంతో మెలగాలని బత్తిలి ఎస్సై డి.అనిల్‌కుమార్, వైఎస్సార్‌సీపీ మండల నాయకుడు టింగ అన్నాజీరావు అన్నారు. సంక్రాంతి సంబరాల్లో భాగంగా బత్తిలిలో ఏర్పాటు చేసిన క్రీడాపోటీలను జనసేన మండల శాఖ అధ్యక్షుడు కిరణ్‌కుమార్‌తో కలిసి శనివారం ప్రారంభించారు. కార్యక్రమంలో విశ్వనాథ పట్నాయక్, నిమ్మల నిబ్బరం పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
పార్వతీపురం / సాలూరు
9010204441, 9951602891
Office mail : vzmadvt@gmail.com